క్లుప్తంగా

పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న నిర్మల ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పోషకాహారాల తయారీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. వరల్డ్ న్యూట్రిషన్ డే సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన న్యూట్రిషన్ ఫుడ్ పదార్థాలను పరిశీలించిన పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌పాల్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పోషకాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంతో శారీరకంగా మానసికంగా ఎంతో ఆనందంగా జీవితాన్ని గడపవచ్చన్నారు. పోషకాహార తయారీ పోటీలలో విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్ఞానసుందరి, ప్రిన్సిపల్ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో నష్టం



మేడికొండూరు: బాల్య వివాహాలపై మేడికొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మేడికొండూరు వెలుగు కార్యాలయ ఏపీఎం విజయభారతి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు కలిగే నష్టాల గురించి ఆమె వివరించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు నిండాలనీ, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన వారే వివాహానికి అర్హులని ఆమె వివరించారు. సరైన సమయం రాకుండా వివాహాలు చేసుకుంటే అమ్మాయిలకు రక్తహీనత సమస్యలు తల్లెత్తుతాయన్నారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసు, ఎంపీడీఓ ప్రభాకర్‌రావు, ఏవో నాగరాజు, మండల సర్వేయర్ జాన్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థుల రక్తదానం



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో సాక్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరి ఎకె పరిదా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేఎల్ వర్సిటీ విద్యార్థులు రక్తదానం చేయడంలో ముందంజలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వానికి అత్యధిక రక్త యూనిట్లు అందించినందుకుగాను ఇండియన్ రెడ్‌క్రాస్ స్టేట్ సెక్రటరీ బీవీఎస్ కుమార్ కేఎల్‌యూకి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం యూనివర్సిటీలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పి.రామచంద్రరావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, యూత్ రెడ్‌క్రాస్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి కటారి సుకీర్తిలు రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మేడికొండూరు: పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. పాలడుగు గ్రామంలో రూ.80లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలోని ఎస్సీకాలనీ వాసులకు తాగునీటిని అందించేందుకు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకుకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని ఎస్టీకాలనీ, బీసీ రజక కాలనీ వాసులకు తాగునీటి పైపు లైన్లు, కుళాయిలకు సంబంధించి రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాత్రమే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, సర్పంచి వాడపర్తి భారతి, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, నాయకులు తుమాటి మురళీ, బొడ్డు రాజ్యలక్ష్మి, పేరం సాంబశివరావు, ముత్యాల బాలస్వామి, బొడ్డు చిన్న సాంబయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష

- కొప్పురావు కాలనీలో వైద్య శిబిరం నిర్వహణ
- తరలివచ్చిన ప్రజలు

మంగళగిరి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగుతుందని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని అన్నారు. సోమవారం నగరంలోని కొప్పురావు కాలనీ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. హేమమాలిని మాట్లాడుతూ ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ఇంటి గడప వద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రజలకు ఒక్క రూపాయి భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై రోగులు సంతోషంగా వైద్య సేవలందుకుంటున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి ఒక్కరికి వైద్య సేవలందించే లక్ష్యంగా కొనసాగుతుండగా జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వార్డు గ్రామ, వార్డు స్థాయిలో ఇళ్ల వద్దనే వైద్య పరీక్షలు నిర్వహించడంతో ఉచితంగా మందులు చేయడం గతంలో ఎన్నడూ జరగలేదని జగనన్న ఆరోగ్య రక్ష అనేది వైద్య సేవలందించడంలో ఓ బృహత్తర కార్యక్రమమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ రాష్ట్ర జేడీ డాక్టర్ రమేష్, డీపీఎంవో రత్నమోహన్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, మలేరియా డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ సత్యవతి, వైద్య ఆరోగ్యశాఖ ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదప్రజలకు ఆసరాగా జగనన్న ఆరోగ్యసురక్ష

ఫిరంగిపురం: పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ఉపయోగకరంగా ఉందని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టార్ ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను ఆయన రుచి చూశారు. ఏ పదార్థం ద్వారా ఎటువంటి పోషక విలువలు శరీరానికి అందుతాయో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తెలిపారు. అనంతరం శిబిరంలో ఏర్పాటుచేసిన ఓపీ సెంటర్, పరీక్షలు నిర్వహించే సిబ్బందిని ప్రజలకు ఎటువంటి పరీక్షలు చేస్తున్నారో లేదో వివరాలు అడిగారు. మందులు సక్రమంగా అందుతున్నాయో లేదో అక్కడికి వచ్చినవారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారంటూ కొందరు మహిళలు చెప్పారు. ఈసీజీ పరీక్ష చేసే గదిని పరిశీలించారు. అనంతరం వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచ్ కె.చిన్న, కె.ఆనంద్, ఎంపీటీసీ సభ్యులు ఎస్.లక్ష్మి, ఎ.అనూరాధ, గాంధీ బుడే, ఓ.కమలారెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, పి. ఐజాక్, మీరా, రఫి, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ డి.అనూరాధ, కార్యదర్శులు ఏకే బాబు, మధు, వైద్యులు పి.ఎస్తేరురాణి, ఫరీనాబేగం, మేఘనా, భీమేష్‌నాయక్, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, కొండపల్లి సుదర్శన్‌రాజు, బాబురావు, ఎంఎల్‌హెచ్‌పీలు స్వప్న, స్పందన, గోవర్ధన, సువర్ణ, సాగర్‌రాణి, అనూష, ఏఎన్‌ఎంలు అరుణ, ఆంతోనిరాణి, భారతీజ్యోతి, లావణ్య, మాబు, సరోజ, వెళాంగిణి, ఆశాకార్యకర్తలు పద్మ, సుజాత, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఈసీజీ పరీక్ష చేస్తున్న తీరు పరిశీలిస్తున్న సమన్వయకర్త కత్తెరసురేష్‌కుమార్, జెడ్పీటీసీ కత్తిరేణమ్మలు

కుటుంబంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి ప్రాధాన్యం

బండారుపల్లి(తాడికొండ): కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమే అని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోగులను ఆప్యాయంగా పలకరించి వైద్యసేవలు సంతృప్తికరంగా ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన మందులను పరిశీలించి రోగులకు అందిస్తున్న మందుల వివరాలు తెలుసుకొని పలువురికి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఖరీదైన వైద్యం అందించాలనే ఏకైక లక్ష్యంతో ఆరోగ్యశ్రీలో అన్ని రకాల సేవలను అందుబాటులో ఉంచారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, ఎంపీటీసీ మల్లేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, ఈవోఆర్డీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు సురక్ష

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలతోపాటు విద్యార్థులకు సైతం ఉపయోగపడేవిధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వెసులుబాటు కల్పించి వారికి ఎటువంటి సమస్యలు లేకుండా చేసేందుకు వైద్యపరీక్షలు చేస్తున్నారని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. సోమవారం దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంతోమంది పేద ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితుల గురించి డాక్టర్లకు వివరించి మందులు ఉచితంగా అందుకుంటున్నారని, ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యంపై అంత శ్రద్ధ చూపించలేదని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వైద్యులను పంపి ప్రతి కుటుంబంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు ఇవ్వడంతో పాటు సూచనలు, సలహాలు అందజేస్తున్నారని వారు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శృంగరపాటి రత్నం, గ్రామ సర్పంచ్ బాణావత్ ఖుషీబాయి, గ్రామ కార్యదర్శి ఎం. రామలింగేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ షేక్ నాగూర్, వైద్యులు ప్రభాకర్ శివ, ఇందిర, కె.తాజుద్దీన్, సుకన్య, వివి కర్ల, వైఎస్సార్ సీపీ నాయకులు ఆత్మకూరు నాగేశ్వరరావు, సూతక్కి కోటేశ్వరరావు, తాడిబోయిన వెంకట నారాయణ, బాణావత్ వెంకటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

మేడికొండూరు: ప్రజల ఆరోగ్యం పట్ల దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని వినూత్న పథకాలు చేపట్టి వారిపై శ్రద్ధ తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని సిరిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న ఇచ్చిన వాగ్దాలను తూచ తప్పకుండా అందిస్తున్నాడన్నారు. ఆరోగ్యం ప్రజల సంక్షేమంపై ముఖ్యంగా శ్రద్ధ వహించి పలు పథకాలు అందివడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటిలో ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి అత్యున్నత వైద్య విధానాన్ని అందిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అని గుర్తుకు తీసుకువచ్చారు. ప్రతి చిన్నారులు చిన్ననాటి నుంచి విద్యను అభ్యసించే విధంగా ఉత్తమ బోధన ప్రభుత్వ పాఠశాలల్లో అందించే విధంగా ప్రభుత్వం పాటుపడుతోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, అబ్బాస్, శౌరెడ్డి, జోసఫ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీవానివాసశర్మ ముత్యాల బాలస్వామి, సుభాని తదితరులు ఉన్నారు.

అమ్మా జగజ్జననీ..పాహిమాం



నృసింహస్వామి ఆలయంలో..



అఖిలాండేశ్వరి ఆలయంలో..



నుదురుపాడులో గాయత్రీమాత



మోరంపూడిలో గాయత్రీగా..



విజయకీలాద్రి పర్వతంపై...



ప్రత్యేక పూజలు

- విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న ఆలయాలు
- పలు అలంకారాలలో దర్శనమిచ్చిన అమ్మవారు

మంగళగిరి: నగరంలో దసరా నవరాత్రులు మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు విద్యుత్ కాంతులతో శోభాయమానంగా వెలుగొందుతు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. రెండవ రోజైన సోమవారం నగరంలోనిలక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (శివాలయం)తోపాటు బైపాస్ రోడ్డు కనకదుర్గ ఆలయంలో అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోర్టుల వద్ద కల అఖిలాండేశ్వరి ఆలయం, రాజీవ్ గృహకల్పరోడ్డులోని కాళీమాత ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో అమ్మ వారు భక్తులకు దర్శనమివ్వగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గాయత్రీమాతగా విశాలక్ష్మి అమ్మవారు

ఫిరంగిపురం: మండలంలోని పలు దేవీ ఆలయాల్లో నవరాత్రుల్లో భాగంగా రెండోరోజు సోమవారం గాయత్రీమాతగా అలంకరించి పూజలు చేశారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి మాతకు అర్చకులు అయ్యన్నశాస్త్రి విశేష పూజలు చేశారు. ఫిరంగిపురంలోని వాసవీమాతను గాయత్రీగా అలంకరించి అర్చకులు రాజేంద్రశర్మ అర్చనలు చేశారు. నుదురుపాడులోని విశాలక్ష్మిమాతను అలంకరించి అర్చకులు పూర్ణచంద్రశాస్త్రి, ఆంజనేయశాస్త్రిలు విశేష కుంకుమార్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

తాడేపల్లిరూరల్: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌తోపాటు, దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో వేంచేసిన ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి గాయత్రీ అలంకారం చేసి భక్తులకు దర్శన మిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి, ఫౌండర్ ట్రస్టీ సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మోరంపూడిలో....

దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలో కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు.



విద్యుత్ వెలుగులో మంగళగిరి శివాలయం

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక విగ్రహాన్ని ఏర్పాటు చేసి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండవ రోజు సోమవారం అమ్మవారికి గాయత్రీ అలంకారం గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వినుకొండ అమ్మ దేవస్థానం

పోలకంపాడులో వేంచేసి ఉన్న వినుకొండ అంకమ్మవారం దేవస్థానంలో అమ్మవారికి గాయత్రీ అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉండవల్లిలో...

ఉండవల్లి సెంటర్‌లో శ్రీ గణేష్‌యూత్ ఉత్సవ

తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లో....

తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లో వేంచేసిన ఉన్న గంగా బాలత్రిపుర సుందరీదేవి శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత శ్రీ త్రిపుర తాండవేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న అమ్మవారికి శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా గాయత్రీదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండి హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

విజయకీలాద్రిపై.....

సీతానగరం విజయకీలాద్రిపై వేంచేసి యున్న అమ్మవారికి త్రిదండి చిన్నజీయర్‌స్వామి, అహోబిల రామానుజ జీయర్‌స్వామి వార్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వీరలక్ష్మి అమ్మవారికి నవ కలశ స్నపనం, తిరుమంజన సేవ, అమ్మవారికి సహస్రనామార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య



మంగళగిరి: నగరంలోని ద్వారకానగర్‌లో పాడుబడిన బావిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆంజనేయ కాలనీలో నివాసముంటున్న చింతక్రింది విజయలక్ష్మి(59) కొంతకాలంగా గుండె జబ్బుతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. జబ్బు నయం కాక పోగా గుండె ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో మనస్థాపానికి గురైన ఆమె సోమవారం ద్వారకానగర్‌లోని పాడుబడిన బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి విజయలక్ష్మి మృతదేహాన్ని వెలికి తీసి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్‌యూ రోడ్డులోని లైన్ల మార్పు నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కుంచనపల్లి, కొలనుకొండ, ఇప్పటం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన కోరారు.

చేనేత వృత్తికి చిహ్నంగా నేతన్న సర్కిల్

- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- నేతన్న విగ్రహ ఏర్పాట్లును పరిశీలన

మంగళగిరి: చేనేత వృత్తికి చిహ్నంగా నేతన్న సర్కిల్ (ఎన్‌ఆర్ఐ జంక్షన్) ఏర్పాటుచేసి నేతన్న విగ్రహాన్ని నెలకొల్పుతున్నామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని ఎన్‌ఆర్ఐ జంక్షన్(నేతన్న సర్కిల్)లో నేతన్న విగ్రహ నిర్మాణ పనులను ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నూతనంగా అవతరించిన రాష్ట్రంలోనే రెండవ అతి పెద్ద విస్తీర్ణం కలిగిన మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్(ఎంటిఎంసి)కి వచ్చే వారికి ముఖద్వారంలోనే 100 అడుగుల జాతీయ జండా ఏర్పాటు చేయడంతోపాటు నేతన్న విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. సుమారు రూ.70లక్షలతో ఎంటిఎంసి ముఖద్వారంలో ఏర్పాటు చేసిన జాతీయ జండా, నేతన్న విగ్రహాలు చారిత్రాత్మకంగా నిలుస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేనేత పరిశ్రమకు అండగా నిలిచి చేనేత వృత్తిదారులకు, కళాకారులు, సామాన్యుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఇప్పటికే నగరంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి రూ.3.60 కోట్లతో మగ్గాల షెడ్లు, రూ.4 కోట్లతో చేనేత భవనం నిర్మాణంతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేనేతకు గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం నగర పరిధిలోని ఆత్మకూరు గుంటూరు ఛానల్ వద్ద కల తాగునీటి పథకం ఆవరణలో జరుగుతున్న స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, వైఎస్సార్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నగర కమిషనర్ యు శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు మల్లవరపు సుధారాణి, గుంటి విజయలక్ష్మి, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, బేతపూడి నరసయ్య, గుండాల శ్రీనివాసరావు, దొడ్డక కృష్ణ, తాడిబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు

లాంలో అనధికారిక లేఅవుట్ల ధ్వంసం

లాం(తాడికొండ): గ్రామంలో అనధికారిక లేఅవుట్లపై సీఆర్డీయే అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతులు లేని లే అవుట్లను గుర్తించి రోడ్లు, హద్దు రాళ్లను పొక్లెయిన్‌తో ధ్వంసం చేశారు. అనంతరం ఇది అనధికారిక లే అవుట్ అని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. గుంటూరు శివారు, చేరువ ప్రాంతం కావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్ను ఇటీవల లాం గ్రామంపై పడింది. అనధికార లే అవుట్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. క్రయ విక్రయాలు జోరుగా కొనసాగుతుండటంతో సీఆర్డీయే అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విశాలమైన రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ కమ్యూనిటీ ఏరియా, పార్కులు చూపించి 10 శాతం భూమిని స్థానిక పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసి వెంచర్లు నిర్మించాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం నామమాత్రపు వసతులతో వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు రూ.కోట్లు దోచుకుంటున్నారు. దీనిపై సీఆర్డీయే అధికారులు దృష్టి సారించడంతో సోమవారం తగిన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ సీఆర్డీయే జోనల్ డెప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా అనుమతులు లేకుండా లే అవుట్‌లు వేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడులలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వి.వంశీకృష్ణ, సిబ్బంది సీహెచ్ స్టాలిన్, రాజేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

మంగళగిరి: నగర పరిధిలోని కాజ గ్రామంలో మద్యం మత్తులో గడ్డి మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాజ వెంకటరెడ్డిపాలెంలో నివాసముంటున్న గుడిపల్లి శ్రీనివాసరావు(42) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మద్యానికి బానిసైన ఆయన ఈనెల మూడో తేదీన విధులు ముగించుకున్న అనంతరం అధికంగా మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. అప్పటికే గొంతు ఎండిపోవడంతో తాగునీరు అనుకుని గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన మూన్నూరి అక్కేశ్వరరావు అదృశ్యమైనట్లు అతని భార్య వసంత పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. అక్కేశ్వరరావు బంగారం వ్యాపారం నిర్వహిస్తుంటాడు. కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్న అతను ఈనెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారు.